సాక్షి సూర్యాపేట

మంగళవారం : 19 : మార్చి : 2024




యాదాద్రిలో డిఫెన్స్ బృందం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం సోమవారం దర్శించుకుంది. - 8లో



గొర్రెల కాపరిగా వచ్చి..

తీసుకున్న అప్పు తీర్చలేక జీతానికి కుదిరిన వ్యక్తి గొర్లు కాసేందుకు వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. - 8లో



న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ప్రారంభం



కంట్రోల్‌రూం ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు సోమవారం అదనపు కలెక్టర్ బీఎస్.లత, జెడ్పీ సీఈఓ అప్పారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందులో సీ–విజిల్, 1950 కాల్ సెంటర్, సువిదా పర్మిషన్, ఎన్‌జీఆర్‌ఎస్ (నేషనల్ గ్రీవెన్స్ రెడ్‌రిసాల్ సిస్టమ్) పోర్టల్ అలాగే డీడబ్ల్యూడీ సాక్షమ్ యాప్ అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏదైనా సమస్యలు తలెత్తితే ప్రజలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకొని పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, ఈడీఎం గఫార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



చివ్వెంల మండల కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చివ్వెంల(సూర్యాపేట) : ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా కోరారు. సోమవారం చివ్వెంలలో ఓటర్లకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ వై.సురేంద్రబాబు, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్ ఎస్ మండలాల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణాన్ని నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం

హుజూర్‌నగర్: హుజూర్‌గనర్ బార్ అసోసియేషన్‌కు జరిగే ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులుగా స్థానిక న్యాయవాదులు ఎంఎస్. రాఘవరావు, వట్టికూటి అంజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించామని అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు సోమవారం విలేకరులకు తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశామన్నారు. ఈనెల 26న బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతాయన్నారు. 19 తేదీ వరకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ, 20న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 26న ఎన్నికల అనంతరం సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.



శ్రీలక్ష్మీనరసింహుల కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) జీలకర్ర బెల్లం పెట్టే తంతు నిర్వహిస్తున్న అర్చకుడు, తలంబ్రాలు పోస్తున్న అర్చకుడు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవారు

కల్యాణ వైభోగమే..

- కనుల పండువగా యాదాద్రీశుడి వివాహ మహోత్సవం
- శ్రీలక్ష్మీదేవిని పరిణయమాడిన నారసింహుడు



స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుకు బొట్టు పెడుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట : జయజయ నారసింహ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. వేద పండితుల మంత్రాలు.. మంగళ వాయిద్యాల మధ్య లోక కల్యాణార్థం నృసింహుడు, దేవేరి శ్రీమహాలక్ష్మి పరిణయ వేడుక వైభవంగా సాగింది. సోమవారం సాయంత్రం 8.45 గంటలకు వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలు ధరించి పెళ్లి కొడుకుగా గజవాహనంపై స్వామివారు, నవ వధువుగా శ్రీలక్ష్మీదేవి దివ్య అలంకార శోభితమై ప్రత్యేక పల్లకిలో ఆలయ తిరు, మాడ వీధుల నుంచి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు బయలుదేరారు. రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం, భూదాన్‌పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం తరఫున తీసుకువచ్చిన పట్టు వస్త్రాలతో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు భక్తులతో కలిసి అలంకార సేవకు ముందు నడిచారు.

మంగళం నారసింహాయ అంటూ..

పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం రాత్రి 9.15 గంటలకు ప్రధానాలయ ఉత్తర మాఢవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఎదురెదురుగా అధిష్టింపజేశారు. మంగళం నారసింహాయ మంగళం.. మంగళం గుణసింధువే.. మంగళం నివాసాయ యాదాద్రీశాయ మంగళం.. అంటూ కల్యాణ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. విశ్వక్సేన ఆరాధన, మంత్రపుష్పం, సంప్రోక్షణ వేడుక నిర్వహించి శ్రీస్వామివారికి ప్రధానార్చకులు కంకణధారణ చేశారు. అనంతరం ఆచార్యులు, వేద పండితులు, పారాయణికులు వేద మంత్రాలు పఠిస్తుండగా ప్రధానార్చకులు శ్రీస్వామివారికి జంజారాధారణ (యజ్ఞోపవీతం) గావించారు.ఆ వెంటనే సకల దేవలత ఆశీస్సులు, వేదమంత్ర పఠనంతో శ్రీస్వామివారు అమ్మవారికి, అమ్మవారు శ్రీస్వామివారికి జీలకర్ర బెల్లం పెట్టే తంతున కనుల పండువగా జరిపించారు. అనంతరం ఆచార్యులు పెట్టిన సుముహూర్తం తుల లగ్నం సోమవారం రాత్రి 10.59 గంటలకు శ్రీనృసింహుడు దేవేరీ శ్రీలక్ష్మీదేవి మెడలో మాంగళ్యధారణ చేశారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాల వేడుక నిర్వహించారు.

కల్యాణోత్సవ సైడ్ లైట్స్

- రాత్రి 8:45 గంటలకు శ్రీస్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని పల్లకిలో నిత్యకల్యాణ మండపంనుంచి పడమటి మాఢ వీధిగుండా ఊరేగింపుగా ఆచార్యులు తీసుకువచ్చారు.
- 8:50కు శ్రీస్వామి, అమ్మవార్లను కల్యాణ వేదికపై ఆచార్యులు వేంచేపు చేశారు.
- 10.02కి శ్రీస్వామి, అమ్మవార్లకు కంకణధారణ
- 10:12కి యజ్ఞోపవీతం
- 10:25కి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, బంగారు ఆభరణాలను అందజేశారు.
- 10:28కి ప్రభుత్వం, టీటీడీ, పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం తరఫున తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు స్వామి, అమ్మవారికి వేశారు.
- 10:53కి జీలకర్ర బెల్లం తంతు జరిపించారు.
- 10: 59కి అమ్మవారి మెడలో మాంగల్యధారణ చేశారు.



పట్టు వస్త్రాలు చూపుతున్న అర్చకులు



కంకణం చూపిస్తున్న ప్రధానార్చకుడు



బాణసంచా కాంతుల్లో కల్యాణ వేదిక

బీఆర్‌ఎస్‌లో తర్జనభర్జన

ఎంపీ అభ్యర్థుల ఎంపికకు సుదీర్ఘ సమాలోచనలు

ఎంపీ అభ్యర్థుల ఎంపికపై బీఆర్‌ఎస్ పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ముందునుంచి టికెట్ ఆశించిన వారు.. ఇప్పుడు పోటీచేయబోమని చెప్పేయగా, మరొకరికి టికెట్ ఇద్దామని పార్టీ ఆలోచిస్తే.. ఆయన పార్టీ మారుతారన్న చర్చ జరుగుతోంది. భువనగిరి టికెట్‌ను బీసీలకు ఇచ్చే ఆలోచనలో ఉన్నప్పటికీ అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా తర్జనభర్జన పడుతోంది.



- నల్లగొండలో కృష్ణారెడ్డికి ఇద్దామా.. ఇంకెవరినైనా చూద్దామా!
- భువనగిరిలో బీసీకి ఓకే.. అభ్యర్థి ఎవరన్న దానిపైనే మల్లగుల్లాలు
- అధిష్టానం అనుకున్న అభ్యర్థుల చూపేమో ఇతర పార్టీల వైపు
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చినా.. తేలని అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మొన్నటి వరకు అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడు ఎంపీ ఎన్నికలకు అభ్యర్థులను వెతుక్కోవాల్సి వస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చినా అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడం లేదు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ అనుకున్న దొకటి.. అయినది మరొకటి అన్న చందంగా తయారైంది. ఒకరు టికెట్ కోసం పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తే, పార్టీ మరొకరికి టిక్కెట్ ఇచ్చే ఆలోచన చేసింది. చివరకు వారిరువురూ పోటీ చేసే పరిస్థితి లేకపోవడంతో ఎవరికిద్దామన్న ఆలోచనలోనే ఉంది. తన తనయుడు గుత్తా అమిత్‌రెడ్డికి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే నల్లగొండ, భువనగిరిలో ఏ పార్లమెంట్ నియోజకవర్గం నుంచైనా పోటీ చేస్తారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పటివరకు చెప్పుకొచ్చారు. తీరా పార్లమెంట్ ఎన్నికలు దగ్గర కొచ్చే సమయానికి.. తాను ఎంపీగా పోటీ చేయబోనని గుత్తా అమిత్‌రెడ్డి అధిష్టానానికి తెలియజేశారు. ఆ తరువాత అమిత్ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో భేటీ కావడంతో పాటు ఇటీవల గుత్తా సుఖేందర్‌రెడ్డి.. బీఆర్‌ఎస్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణం సరిగ్గా లేదని, విభేదాలను ముందే పరిష్కరించి ఉంటే పోటీచేసే వాళ్లమని చెబుతూనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన బాగుందంటూ సమర్థించారు. దీంతో వారు కాంగ్రెస్ పార్టీలో చేరతారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి తాను ఎంపీగా పోటీ చేస్తానని అధిష్టానానికి తెలియజేశారు. కేసీఆర్ దగ్గర జరిగిన సమావేశానికి కూడా హాజరయ్యారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డిని బరిలో నిలపాలని పార్టీకి చెందిన ముఖ్యనేతలు భావించారు. ఆయనతో మంతనాలు జరిపారు. అనూహ్యంగా నాలుగు రోజుల కిందట చిన్నపరెడ్డి బీజేపీ నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఆయన బీజేపీలో చేరతారనే చర్చ సాగుతోంది.

కృష్ణారెడ్డికి ఇస్తే ఎలా ఉంటుందని..

గుత్తా అమిత్‌రెడ్డి దూరంగా ఉండటం, ఇటు చిన్నపరెడ్డి బీజేపీవైపు చూస్తుండటంతో కృష్ణారెడ్డికే నల్లగొండ ఎంపీ టికెట్ దాదాపు ఖరారు అయినట్లుగా అంతా భావించారు. అయితే అధిష్టానం మాత్రం ఈ విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. కృష్ణారెడ్డినే పోటీలో నిలుపుదామా? ఆయనను పోటీలో నిలిపితే పరిస్థితి ఏంటి? లేదంటే ఇంకా ఎవరినైనా చూద్దామా? అనే ఆలోచనలు చేస్తున్నట్లుగా తెలిసింది. ఈ విషయంలో జిల్లా నేతలు, మాజీ ఎమ్మెల్యేలతో పార్టీ ముఖ్యనేత ఒకరు చర్చిస్తున్నట్లు తెలిసింది.

భువనగిరిలో బీసీ వైపే మొగ్గు

భువనగిరి ఎంపీ టికెట్ బీసీకే ఇవ్వాలనే ఆలోచనలో బీఆర్‌ఎస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అభ్యర్థి ఎవరనే దానిపై తర్జనభర్జన పడుతోంది. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, ఇబ్రహీంపట్నంకు చెందిన క్యామ మల్లేష్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. బీజేపీ భువనగిరిలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని తమ అభ్యర్థులుగా ఇప్పటికే ప్రకటించింది. ఆ పార్టీ రెండు చోట్ల అభ్యర్థులు ప్రచారంలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఇప్పటికే నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డిని ఖరారు చేసింది. భువనగిరి అభ్యర్థిని నేడో రేపో ప్రకటించే అవకాశం ఉంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని పోటీచేయించాలని ఆయనపై అధిష్టానం ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు విముఖత చూపడంతో.. కాంగ్రెస్‌లో చేరతారనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎవరిని బరిలో నిలుపుతుందన్నది నేడో రేపో తేలే అవకాశం ఉంది.

కేంద్ర బలగాల తనిఖీలు

నల్లగొండ క్రైం : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేంద్రం సాయుధ బలగాలు సోమవారం తనిఖీలు చేపట్టాయి. ప్రజలను ప్రలోభపెట్టకుండా.. వారు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఈ తనిఖీలు సాగుతున్నాయి. సోమవారం నల్లగొండతో పాటు ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో వాహన తనిఖీలు, అనుమానిత వ్యక్తుల నివాసాల్లో తనిఖీలు చేశారు.



నల్లగొండలో తనిఖీలు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

మొదటి రోజు 40మంది గైర్హాజరు



జిల్లా కేంద్రంలోని జీఆర్ వివేకావాణి సెంటర్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటరావు

- పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట టౌన్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 67 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తొలి రోజు తెలుగు పరీక్ష జరిగింది. మొత్తం 11,946 మంది విద్యార్థులకు 11,904 మంది హాజరు కాగా 39 మంది గైర్హాజరయ్యారు. గత సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు 18 మందికి 17 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు తనిఖీ చేశారు.

పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి

పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే పిల్లలకు ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని, ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతే లోనికి పంపాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందు విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

సూర్యాపేట టౌన్ : సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా బీసీలకు ఇవ్వలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ మాదిరిగా మోసం చేయకుండా రాష్ట్రంలో ఆరు లోక్‌సభ స్థానాలైనా బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా



పోతరాజు రజని

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ తన పదవికి, 5వ వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డికి పంపినట్లు పేర్కొన్నారు. తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ కాంగ్రెస్ కౌన్సిలర్లు గతనెల 26న కలెక్టర్‌కు తీర్మాన పత్రం అందజేశారు. దీంతో ఈనెల 20న అవిశ్వాసం తీర్మానం పెట్టేలా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ తన పదవులకు రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రజలను మోసం చేస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ రాహుల్ హెగ్డే



ఏఆర్ ఎస్‌ఐ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం: ఉద్యోగాలు, పథకాలు, బహుమతులు అంటూ అమాయక ప్రజలను ఆర్థికంగా మోసం చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో వినతులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు ఇలాంటి వారిని నమ్మి డబ్బు ఇవ్వొద్దన్నారు. ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకుంటూ బాధితులకు పోలీసులు భరోసా కల్పించాలని ఎస్పీ ఆదేశించారు.

ఏఆర్ ఎస్‌ఐ కుటుంబానికి చేయూత

జిల్లా ఆర్మడ్ విభాగం బాంబ్ స్క్వాడ్‌లో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన ఏఆర్ ఎస్‌ఐ వెంకటయ్య కుటుంబానికి పోలీసు చేయూత పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎస్పీ రాహుల్ హెగ్డే అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సంఘం సభ్యులు కృష్ణ, సంక్షేమ ఆర్‌ఐ నర్సింహ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల: ప్రస్తుత వేసవి నేపథ్యంలో నర్సరీలలో మొక్కల పెంపకం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.శిరీష అన్నారు. సోమవారం ఆమె మునగాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నర్సరీలో నీటిపోషణ ముఖ్యమన్నారు. మొలకెత్తని విత్తనాలు ఉంటే వాటి స్థానంలో కొత్త విత్తనాలు నాటాలని సూచించారు. అనంతరం ఆమె మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు సీతారామరాజు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఏపీఓ శైలజ, టీఏ శేఖర్, ఎఫ్ఏ కృష్ణవేణి పాల్గొన్నారు.



మునగాలలో నర్సరీని పరిశీలిస్తున్న శిరీష

క్లుప్తంగా

తండ్రి మరణించిన దుఃఖంలోనూ పరీక్షకు..


మౌనిక

తిరుమలగిరి (తుంగతుర్తి): తండ్రి మరణించిన పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షలకు హాజరైంది. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్న గౌడ్ ఆదివారం కల్లు గీయడానికి వెళ్లి తాటి చెట్టుపైనే గుండెపోటుతో మరణించిన విషయం విదితమే. వెంకన్న గౌడ్ కుమార్తె గుండెపురి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. సోమవారం తిరుమలగిరిలోని పరీక్షా కేంద్రానికి వచ్చి పదో తరగతి పరీక్ష రాసింది.

'పది' పరీక్షల్లో అపశ్రుతి

- కోతులు వెంటపడడంతో భవనం పైనుంచి దూకిన విద్యార్థిని


గాయపడిన మనోజ్ఞ

భూదాన్‌పోచంపల్లి: 'పది' పరీక్షల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మొదటి అంతస్తులో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడంతో పరీక్ష రాయడానికి స్థానిక గౌతమి హైస్కూల్‌కు చెందిన మనోజ్ఞ అనే విద్యార్థిని భవనం పైకి ఎక్కింది. అదే సమయంలో మూడు కోతులు విద్యార్థిని వెంటపడటంతో ఆమె భయంతో పరుగులు తీస్తూ భవనంపై నుంచి కిందికి దూకింది. అక్కడే ఉన్న టీచర్లు గమనించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం గాయాలతోనే ఆమె పరీక్ష రాసింది.

హనుమంత వాహనంపై శ్రీరాముడిగా..

- ఆలయ వీధుల్లో ఊరేగిన నృసింహుడు


కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈఓ భాస్కర్‌రావు, అధికారులు, అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిత్యారాధనలు, శ్రీవైష్ణవ సేవ సమాఖ్య వారిచే ప్రభాత భేరీ, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అనంతరం 9.30గంటలకు స్వామి వారిని ధర్మమూర్తి అయిన శ్రీరామ అలంకారములో హనుమంత వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఉదయం జరిగిన వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ తూర్పు మాఢ వీధిలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక వేడుకల్లో భాగంగా సోమవారం యం.శ్రీనివాస్ అండ్ పార్టీ, ఖమ్మంకు చెందిన శ్రీ శంకర మహిళ భజన మండలి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. అనంతరం మైలవరపు శ్రీనివాసరావుచే నృసింహతత్వ వైభవం అను విషయంపై ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ముదపాక బాలసుందరం భాగవతార్‌చే విరాట పర్వం హరికథ గానం నిర్వహించారు. సాయంత్రం నూకల జగదీశ్వరి, భక్తి రంజని, గోదా నరసింహారావుచే భక్తి సంగీత కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ జయప్రద రామమూర్తి వేణుగానం అందరినీ అలరించింది.

ఉచిత వైద్య శిబిరం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాదాద్రి కొండపైన గల ప్రధాన కార్యాలయం, కొండ కింద కొత్త బస్టాండ్, కల్యాణకట్ట వద్ద ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం హైదరాబాద్‌లోని కొత్తపేటకు చెందిన శ్రీసాయి సంజీవని ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ అంజయ్య, యాదగిరిగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

దేవాదాయ కమిషనర్ పూజలు

యాదాద్రీశుడిని దేవాదాయశాఖ కమిషనర్ కమిషనర్ హనుమంతరావు, కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్ రావు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కల్యాణోత్సవం సందర్భంగా కమిషనర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పండ్లు, పూలను కుటుంబ సభ్యులతో కలిసి తీసుకువచ్చి ఆలయాధికారులు, ఆచార్యులకు అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు.

వేడుకల్లో నేడు


ఉత్సవాల్లో మంగళవారం ఉదయం స్వామి వారు శ్రీమహా విష్ణు అలంకార గరుడ వాహన సేవ, రాత్రి 8.45గంటలకు దివ్య విమాన రథోత్సవం నిర్వహిస్తారు.

యాదాద్రికి నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం


ఆలయంలో ఏకే సింగ్, బృందం సభ్యులు

యాదాద్రీశుడిని న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీకి చెందిన దేశ, విదేశాలకు చెందిన 16మంది సభ్యుల బృందం మేజర్ జనరల్ ఎ.కే.సింగ్ ఆధ్వర్యంలో సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఆచార్యులు వారికి స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న ఎ.కే.సింగ్, 16మంది బృందం సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. మేజర్ జనరల్ ఎ.కే.సింగ్ మాట్లాడుతూ, స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా యాదాద్రీశుడి ఆలయాన్ని సందర్శించినట్లు వెల్లడించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవలో పాల్గొన్నారు. అంతకు ముందు వీరికి ప్రెసిడెన్షియల్ సూట్‌లో కలెక్టర్ హనుమంత్ జెండగే, డీసీపీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ అమరేందర్ స్వాగతం పలికారు.


హనుమంత వాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు


విశేష అలంకరణలో అమ్మవారు


లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు, విద్యుత్ కాంతుల్లో ఆలయం

గుర్తుతెలియని వ్యక్తి హత్య

- కాళ్లు కట్టేసి.. తాడుతో ఉరి బిగించి ఘాతుకం
- తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి శివారులోని బావిలో మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రామగిరి(నల్లగొండ): గుర్తుతెలియని వ్యక్తిని దారుణంగా హత్య చేసి వ్యవసాయ బావిలో పడవేశారు. ఈ ఘటన తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి శివారులో వెలుగు చూసింది. అనిశెట్టి దుప్పలపల్లి శివారులో సక్కుబాయికి చెందిన వ్యవసాయ భూమిని పవన్ కౌలు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం బోరు బావిలో పరిశీలించగా నీటిపై మృతదేహం తెలియాడడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు కాళ్లు, గొంతు వద్ద తాళ్లతో కట్టి ఉండడం వల్ల హత్య చేసి బావిలో పడేశారని భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని ఎస్ఐ రాజు తెలిపారు. మృతదేహాన్ని నల్ల గొండ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహ వేడుకకు వచ్చి అనంతలోకాలకు..

- రెండు బైక్‌లు ఢీకొని మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతురాలు తిరుమలగిరి మండల వాసి

దేవరుప్పుల: వివాహ వేడుకకు వచ్చి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి శివారులో జనగామ-సూర్యాపేట రహదారిపై జరిగింది. ఎస్ఐ ఎస్ చెన్నకేశవుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురానికి చెందిన ధారావత్ నవీన్ తన తల్లి బుజ్జి(50)ని తీసుకొని దేవరుప్పుల మండలం ధర్మాపురంలో జరిగిన తన బాబాయి కొడుకు వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. గొల్లపల్లి బస్‌స్టేజీ వద్దకు రాగానే ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆకవరం మోహన్‌రెడ్డి బైక్‌పై రోడ్డు క్రాస్ చేసి వెళ్తుండగా నవీన్ అదుపు తప్పి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుజ్జి మృతిచెందగా, మోహన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లో చికెన్ సెంటర్ నడిపి జీవిస్తున్న నవీన్‌నాయక్ వివాహానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో తల్లిని కోల్పోవడంతో బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

గొర్రెల కాపరిగా వచ్చి విగతజీవుడై..

- అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

పెన్‌పహాడ్: తీసుకున్న రుణం తిరిగి చెల్లించలేక జీతానికి కుదిరిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం బొర్రాయిపాలెం అన్నారం గ్రామానికి చెందిన ఆవుల కోటయ్య(50) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కోటయ్య మూడేళ్ల క్రితం పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన పర్వతం చంద్రయ్య వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకుని ముఖం చాటేశాడు. రెండు నెలలక్రితం చంద్రయ్యకు కోటయ్య తారసపడడంతో అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాడు.

అప్పు తీర్చేందుకు జీతం చేయాలని..

అప్పు తిరిగి చెల్లించలేని స్థితిలో ఉన్న కోటయ్య తన వద్ద వ్యవసాయ పనులు చేయడంతో పాటు గొర్లు కాయాలని చంద్రయ్య షరతు విధించాడు. అందులో భాగంగా కోటయ్యను నెల రోజుల క్రితం నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామానికి తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నాడు. చంద్రయ్య షరతుకు అనుగుణంగా కోటయ్య నాగులపాటి అన్నారం గ్రామంలో వ్యవసాయ పనులు చేయడంతో పాటు గొర్రెలు కాస్తున్నాడు. ఇటీవల కోటయ్య కాస్తున్న గొర్రెల మందలో నుంచి ఒకటి కనిపించలేదు. దీంతో ఆగ్రహించిన చంద్రయ్య కుమారులు కోటయ్యను తీవ్రంగా కొట్టారు. విషయం తెలుసుకున్న కోటయ్య కుటుంబ సభ్యులు చంద్రయ్యకు ఫోన్ చేశారు. అప్పు త్వరలోనే చెల్లిస్తామని కోటయ్యను విముక్తి చేయాలని వేడుకున్నా కనికరించలేదు. అప్పు చెల్లించి కోటయ్యను తీసుకువెళ్లాలని చెప్పాడు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున కోటయ్య గ్రామ శివారులోని చెట్టుకు వేలాడుతూ స్థానికులకు కనిపించాడు. మృతుడికి భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన

కోటయ్య మరణించాడనే విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామానికి వచ్చారు. కోటయ్యను చంద్రయ్యనే హత్య చేశాడని ఆరోపిస్తూ అతడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి సముదాయించినా వినిపించుకోలేదు. చివరకు చంద్రయ్య వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

నిషేధిత పేలుడు పదార్థాలు స్వాధీనం

వలిగొండ: అనుమతులు లేకుండా బ్లాసింగ్ చేస్తున్న ఇద్దరిని సోమవారం ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నిషేధిత పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల నంగునూరి రమేష్ వ్యవసాయ క్షేత్రంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు భువనగిరి ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. బ్లాస్టింగ్‌కు ఉపయోగించే 53 జిలెటిన్ స్టిక్స్ , బిండల్ కనెక్షన్ వైరు, మెగ్గర్ బాక్స్ , తెల్లని కనెక్టింగ్ వైర్లను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. అనుమతులు లేకుండా పేలుళ్లకు పాల్పడుతున్న కొమ్మగాని శ్రీధర్, నంగునూరి రమేష్ ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వలిగొండ ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

బర్త్ సర్టిఫికెట్ అడిగితే డెత్ సర్టిఫికెట్‌కు ఆదేశాలు!

- ఇదీ.. నందికొండ మున్సిపాలిటీ తీరు



డెత్ సర్టిఫికెట్ అని కొట్టేసి బర్త్ సర్టిఫికెట్ రాసిన సిబ్బంది

నాగార్జునసాగర్: బర్త్ సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే సదరు అధికారి పరిశీలించకుండానే డెత్ సర్టిఫికెట్‌కు ఆదేశాలు జారీ చేశాడు. నందికొండ మున్సిపాలిటీలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీకి చెందిన షేక్ అహ్మద్ తన కూతురు సాహియా, కొడుకు అబ్బాస్‌అలీలకు బర్త్ సర్టిఫికెట్ కావాలని, ఒక్కొక్కరికి రూ.200లు చెల్లించి మున్సిపాలిటీ కార్యాలయంలో దరకాస్తు చేశాడు. సదరు అధికారి దరఖాస్తును పరిశీలించకుండానే రశీదులో డెత్ సర్టిఫికెట్ అని రాసి షేక్ అహ్మద్‌కు ఇచ్చాడు. దానిని పరిశీలించిన అహ్మద్ ఇదేంటని అడిగితే మరో రశీదైన రాయకుండా అందులోనే ఒక కాలంలో రాసిన దానిని కొట్టివేసి అక్కడే బర్త్ సర్టిఫికెట్ అని రాశాడు. మరో కాలంలో డెత్ సర్టిఫికెట్ అని అలాగే ఉంచాడు. ఈ అంశాలపై నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ దండు శ్రీనును వివరణ కోరగా పొరపాటున రాశారు.. వాటిని సరిచేస్తామని తెలిపారు. గతంలో రశీదులు ఇచ్చేవారు కాదని తాను వచ్చిన తర్వాత పద్ధతిగా కార్యాలయం నడిచేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.